


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
23-06-2025
పేజీలు: 02




## పోచారంలో హైడ్రా బుల్డోజర్లు

మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీలో హైడ్రా అధికారులు బుల్డోజర్లకు పనిచెప్పారు. కొర్రెముల రెవెన్యూ పరిధిలోని ఏకశిలా నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఓ వెంచర్‌లో ఉన్న ప్లాట్లకు అడ్డుగా రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రహరీ గోడ నిర్మించారు. దీంతో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్వే నిర్వహించిన అధికారులు అది అక్రమ నిర్మాణామని గుర్తించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా భారీగా పోలీసులు, హైడ్రా సిబ్బంది మోహరించారు.



## చర్చిలో ఆత్మాహుతి దాడి.. 22 మంది మృతి

సిరియా రాజధాని డమాస్కస్ శివారులో ఉన్న ఓ చర్చిలో ఆత్మాహుతి దాడి జరిగింది. డ్వెయిల్ ప్రాంతంలోని మార్ ఎలియాస్ చర్చిలో ఈ ఘటన చోటుచేసుకున్నది. కిక్కిరిసిన చర్చిలో జనం ప్రార్థనలు చేస్తుండగా ఓ వ్యక్తి తనను తాను పేల్చుకున్నాడు. దీంతో ఇప్పటివరకు 22 మంది చనిపోయారు. మరో 63 మంది గాయపడ్డారు. చనిపోయినవారులో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ దాడికి సంబంధించి ఏ ఉగ్రసంస్థ బాధ్యులమని ప్రకటించుకోలేదు.చర్చిలో జనం మధ్యకు చేరుకున్న ఓ వ్యక్తి తొలుత తుపాకీతో కాల్పులు జరిపి, అనంతరం తనను తాను పేల్చుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపినట్లు సిరియా అంతర్గత మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దుండగుడు చర్చిలో గ్రెనేడ్ విసిరినట్లు చర్చి బిషప్ తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని తాను చూశానని, అతనితోపాటు మరో ఇద్దరు కూడా ఉన్నారని ప్రత్యక్ష సాక్షి పేర్కొన్నారు. ఈ దాడిని సిరియా సమాచార మంత్రిత్వ శాఖ మంత్రి హమ్జా మొస్తాఫా ఖండించారు. దీనిని పిరికిపంద దాడిగా అభివర్ణించారు. కాగా, చర్చిల్లో దాడులు జరగడం సిరియాలో ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం.



# చెలరేగిన బుమ్రా

టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రా నిప్పులు చెరగడంతో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్ జరుగుతున్న తొలి టెస్టులో భారత్‌కు 6 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది. బుమ్రా దెబ్బకు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 465 పరుగులకు ఆలౌటైంది. ఓలీ పోప్(106) సెంచరీతో రాణించగా.. హ్యారీబ్రూ క్(99) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. జేమీ స్మిత్(40) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో బుమ్రా(5/83) ఐదు వికెట్లు తీయగా.. ప్రసిద్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ సిరాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో భారత్ పేలవ ఫీల్డింగ్‌తో భారీ ఆధిఖ్యాన్ని చేజార్చుకుంది.భారత ఆటగాళ్లు దాదాపు ఐదు క్యాచ్‌లు నేలపాలు చేశారు. బుమ్రా వేసిన నోబాల్‌తో బ్రూక్ డకౌటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.

**హ్యారీ బ్రూక్ దూకుడు..**

209/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడోరోజు(ఆదివారం) ఆటను కొనసాగించిన ఇంగ్లంగ్‌కు ఆదిలోనే గట్టిషాక్ తగిలింది. సెంచరీహీరో ఓలి పోప్(106) ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈక్రమంలో హ్యారీ బ్రూక్‌కకు జత కలిసిన బెన్‌స్టోక్స్ ఆచితూచి ఆడాడు. స్టోక్స్ నెమ్మదిగా ఆడినా హ్యారీ బ్రూక్ దూకుడుగా ఆడుతూ.. పరుగులు రాబట్టాడు. క్రీజులో సెట్ అయి న ఈ జోడీని సిరాజ్ విడదీసాడు. దాంతో ఐదో వికెట్‌కు నమోదైన 51 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంరతం క్రీజులోకి వచ్చిన జెమీ స్మిత్ సయితం దూకుడుగా ఆడాడు. ఈ ఇద్దరూ సిరాజ్, ప్రసిధ్ కృష్ణలను చెడుగుడు ఆడారు. ఈ క్రమంలో హ్యారీబ్రూక్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో ఇంగ్లండ్ 327/5 స్కోర్‌కు లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లోనూ ఈ జోడీ దూకుడుగా బ్యాటింగ్ చేసింది. అయితే దూకుడుగా ఆడిన జేమీ స్మిత్‌ను ప్రసిధ్ పెవిలియన్ చేర్చాడు. బౌండరీ లైన్‌పై జడేజా, సాయి సుదర్శన్ అద్భుతమైన ఫీల్డింగ్‌తో క్యాచ్ ఔట్ చేశాడు. దాంతో ఆరో వికెట్‌కు నమోదైన 73 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ కాసేపటికే సెంచరీకి ఒక్క పరుగు ముంగిట హ్యారీబ్రూక్(99) క్యాచ్ ఔటయ్యాడు. ఈ పరిస్థితుల్లో క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్ ఆచితూచి ఆడి 8వ వికెట్‌కు 55 పరుగులు జోడించారు. కార్స్(22)ను సిరాజ్ ఔట్ చేయగా.. క్రిస్ వోక్స్‌ను బుమ్రా పెవిలియన్ చేర్చాడు. జోష్ టంగ్‌ను ఆఖరి వికెట్‌గా పెవిలియన్ పంపాడు. భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా నయా చరిత్ర సృష్టించాడు. విదేశాల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఆసియా బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. సెనా(సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో 150 వికెట్లు తీసిన తొలి ఆసియా బౌలర్‌గా నిలిచాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న లీడ్స్ టెస్టులో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో (5/83) ఐదు వికెట్లు పడగొట్టడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. ఈ క్రమం లో అతను పాకిస్థాన్ దిగ్గజ పేసర్ వసీమ్ అక్రమ్ రికార్డును అధిగమించాడు. సెనా దేశాల్లో వసీం అక్రమ్ 146 వికెట్లు తీసాడు. సెనా దేశాల్లో అత్యధిక వికెట్లు తీసిన ఆసియా బౌలర్ల జాబితాలో బుమ్రా, వసీమ్ అక్రమ్ తర్వాత అనిల్ కుంబ్లే(141), ఇషాంత్ శర్మ(130) లు ఉన్నారు. ఇక విదేశీ గడ్డపై అత్యధిక సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్న బౌలర్‌గా కపిల్ దేవ్ రికార్డ్ను బుమ్రా సమం చేశా డు.

### రేషన్ పంపిణీలో జాప్యం.. లబ్ధిదారుల పడిగాపులు

రామచంద్రాపురం మండల పరిధిలో గల రేషన్ షాపులలో గత 20 రోజులుగా రేషన్ బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొంది. రేషన్ కార్డు లబ్ధిదారులు బియ్యంకోసం గంటల తరబడి బారులు తీరి అవస్థలు పడుతున్నారు. సోమవారం వరకు 4, 5 గంటలు వేచి ఉన్నా బియ్యం వస్తాయనే నమ్మకం లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు.



## టీటీడీకి ఎసీ బస్సు విరాళం

ప్రఖ్యాత ఆటో మొబైల్ కంపెనీ, అశోక్ లేలాండ్ టిటిడికి ఒక 41 సీటర్ ఏసి బస్సును ఆదివారం నాడు విరాళంగా అందించింది. సుమారు రూ. 35 లక్షల విలువైన ఈ బస్సును అశోక్ లేలాండ్ ఎం హెచ్ సివి అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు టిటిడికి అందజేశారు. సాధారణంగా ప్రతి ఏడాది అశోక్ లేలాండ్ కంపెనీ వారు టిటిడికి ఒక ఆటోమొబైల్ వాహనాన్ని విరాళంగా అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, తిరుమల డిపో డిఐ వెంకటాద్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## ఈ తరం మెచ్చేలా పాట

బన్నీ వాస్ నూతన నిర్మాణ సంస్థ బి.వి. వరక్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ‘మిత్ర మండలి’. అభిరుచి గల నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సోషల్ మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం. తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు విశేష స్పందన లభించింది. ఈ చిత్రం అపరిమిత వినోదాన్ని అందించనుందనే నమ్మకాన్ని టీజర్ కలిగించింది. తాజాగా 'మిత్ర మండలి' నుంచి మొదటి గీతం ‘కత్తందుకో జానకి’ని నిర్మాతలు విడుదల చేశారు. ఈ గీతావిష్కరణ కార్యక్రమం అమలాపురంలోని కిమ్స్ కాలేజ్‌లో జరిగింది. రెబల్ స్టార్ కృష్ణంరాజు ఐకానిక్ డైలాగ్ ‘కత్తందుకో జానకి’ని తీసుకొని, ఈ తరం మెచ్చేలా అద్భుతమైన పాటగా మలిచారు. ఆర్.ఆర్. ధృవన్ స్వరపరిచిన ఈ గీతం.. వినసొంపుగా, అందరూ సరదాగా పాడుకునేలా ఉంది. అమలాపురం కిమ్స్ కాలేజ్ లో జరిగిన 'కత్తందుకో జానకి' గీతావిష్కరణ వేడుకకు ముఖ్య అతిథిగా అమలాపురం ఎంపీ జి.ఎం. హరీష్ బాలయోగి హాజరయ్యారు.



## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ఇరాన్‌లోని కీలకమైన అణు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించిన తర్వాత శుక్రవారం ప్రారంభ ట్రేడింగ్‌లో బెంచ్‌మార్క్ మార్కెట్ సూచీలు పడిపోయాయి. ఇది కొత్త భౌగోళిక రాజకీయ అనిశ్చితికి దారితీసింది. ఉదయం 9:31 గంటల ప్రాంతంలో BSE సెన్సెక్స్ 679.12 పాయింట్లు తగ్గి 81,729.05 వద్ద ట్రేడవుతుండగా, NSE నిఫ్టీ 50 199.30 పాయింట్లకు పైగా పడిపోయి 24,913.10 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్ సూచికలు ఈ పతనానికి అద్దం పట్టాయి. అస్థిరత సూచికలు తీవ్రంగా పెరిగాయి.ప్రస్తుత అస్థిరతల మధ్య, దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ప్రశాంతంగా ఉండాలని, మొండి చర్యలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. మార్కెట్ నిర్మాణం ‘కొనుగోలుపై తగ్గుదల’ వ్యూహానికి అనుకూలంగా కొనసాగుతోంది,'' అని విజయకుమార్ పేర్కొన్నారు. భౌగోళిక రాజకీయ షాక్‌లు సాధారణంగా స్వల్పకాలిక అల్లకల్లోలానికి కారణమవుతాయి. కానీ అవి నిరంతర సంఘర్షణకు దారితీస్తే తప్ప, దీర్ఘకాలిక ప్రభావం ఉండదని అన్నారు.



విశ్లేషకులు అధిక-నాణ్యత గల స్టాక్‌లతోనే ఉండాలని, తగినంత ద్రవ్యతను కొనసాగించాలని, లివరేజ్డ్ పందెం వేయకుండా ఉండాలని కూడా సిఫార్సు చేస్తున్నారు. ప్రపంచ మార్కెట్లలో రిస్క్ సెంటిమెంట్ మరింత దిగజారితే ఐటీ స్టాక్‌లు ఒత్తిడిలో ఉండవచ్చు. ఇంధనం, రక్షణ సంబంధిత రంగాలు స్వల్పకాలిక ప్రతికూలతలను చూడవచ్చు. రాబోయే రోజుల్లో అమెరికా, ఇరాన్ నుండి వచ్చే సంకేతాలను నిశితంగా గమనించాలని పెట్టుబడిదారులకు సూచించారు.

## మత్తెక్కిస్తున్న మృణాళిని రవి

తెలుగులో ఒకే ఒక్క సినిమాతో పాపులర్ అయ్యింది మృణాళిని రవి. వరుణ్ తేజ్ నటించిన గద్దల కొండ గణేష్ సినిమాతో పరిచయం అయ్యింది. గద్దల కొండ గణేష్ సినిమాలో బుజ్జమ్మ పాత్రలో తన క్యూట్ పర్ఫామెన్స్ తో కవ్వించింది మృణాళిని రవి.ఈ అమ్మడు 2019లో విడుదలైన సూపర్ డీలక్స్ సినిమా ద్వారా సినీరంగం లోకి అడుగు పెట్టింది. ఆతర్వాత వరుస ఆఫర్స్ అందుకుంది. మొదట్లో మృణాళిని రవి సోషల్ మీడియాలో డబ్‌స్మాష్‌తో వీడియోలు చేస్తూ పాపులర్ అయ్యింది.ఆ వీడియోలు చూసిన త్యాగరాజన్ కుమార్ రాజా ఆమెకు సూపర్ డీలక్స్ సినిమాలో నటించే అవకాశం కల్పించాడు. అలా హీరోయిన్ గా మారింది మృణాళిని రవి. ఆతర్వాత వరుసగా హీరోయిన్ గా అవకాశాలు అందుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసింది. తమిళ్ తెలుగు భాషల్లో ఈ బ్యూటీకి క్రేజీ ఆఫర్స్ వచ్చాయి. ఇక తెలుగులో ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు, మాయ మశ్చేంద్ర, లవ్ గురు సినిమాల్లో నటించింది. అలాగే తమిళ్ లో విశాల్ ఎనిమి, విక్రమ్ కోబ్రా సినిమాల్లోనూ నటించింది. ఇక ఈ అమ్మడు ఇప్పుడు సోషల్ మీడియాతో ఫుల్ బిజీగా గడిపేస్తుంది. తాజాగా ఈ చిన్నది షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. అందాలు ఆరబోస్తూ.. వయ్యారాలు ఒలకబోస్తూ ఫోటోలకు ఫోజులిస్తుంది.

## అంపైర్‌పై పంత్ అసహనం



టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. ఇంగ్లండ్‌తో లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ మూడోరోజు ఆటలో బంతిని మార్చాలని రిషభ్ పంత్ చేసిన విన్నపాన్ని అంపైర్ తిరస్కరించాడు. దాంతో సహనం కోల్పోయిన పంత్.. బంతిని నేలకుకొట్టాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్లో 61వ ఓవర్ అనంతరం ఈ ఘటన చోటు చేసుకుంది. ఓవర్ ముగియగానే బంతిని అంపైర్ వద్దకు తీసుకెళ్లిన పంత్.. ఆకారం దెబ్బతిన్నదని ఫిర్యాదు చేశాడు. దాంతో అంపైర్ తన వద్ద ఉన్న పరికరంతో బంతి ఆకారాన్ని పరీక్షించాడు. బాగానే ఉందని, బంతిని మార్చాల్సిన అవసరం లేదని చెప్పాడు. దాంతో అసహనానికిగురైన పంత్.. అంపైర్‌పై కోపంతో బంతిని నేలకు కొట్టాడు. పంత్ రియాక్షన్‌కు అంపైర్ అవాక్కయ్యాడు.




# హారర్ కామెడీ ఎంటర్‌టైనర్

మాస్ బంక్ మూవీస్ పతాకంపై కొండా వెంకట రాజేంద్ర, మనిషా జష్నాని, సుస్మిత అనాలా, సాంచిరాయ్ హీరోహీరోయిన్లుగా లక్ష్మీ గణేష్, వెంకట రాజేంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్న హర్రర్ బేస్డ్ కామెడీ ఎంటర్ టైనర్ చిత్రం 'లోపలికి రా చెప్తా'. కొండా వెంకట రాజేంద్ర హీరోగా నటించడమే కాకుండా ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు విడుదలైన ఈ సినిమా పాటలు, పోస్టర్స్ కు మంచి స్పందన వచ్చింది. 'లోపలికి రా చెప్తా' చిత్రం జూలై 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతోంది. హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ చేతుల మీదుగా ట్రైలర్ లాంఛ్ జరిగింది.




# నేడు కేబినెట్ భేటీ

రా ష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సోమవారం జరిగే మంత్రివ ర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీ సుకునే అవకాశం ఉంది. గ్రామ పం చాయతీ ఎన్నికలు, జిల్లా మండల పరిషత్ ఎన్నికల్లో వేటికి ముందుగా నిర్ణయించాలనే అంశంపై స్పష్టత రా నున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలంయలో మంత్రివర్గ సమావే శం జరుగనున్నది. ఈ సమావేశం లో రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారు. స్థాని క సంస్థల ఎన్నికలు, బనకచర్ల ప్రా జెక్ట్, రాజీవ్ యువ వికాసం, రైతు భరోసా తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. కేబినెట్ స మావేశంలో జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ స్థాయిలో జరి గే ఎన్నికల షెడ్యూల్‌పై ప్రాథమిక చర్చ జరిగే అవకాశం ఉంది. తద్వా రా స్థానిక సంస్థల పాలనను మరిం త బలోపేతం చేయాలనే ప్రభుత్వ యోచిస్తున్నట్లు తెలిసింది. మంత్రివ ర్గ సమావేశం నిర్ణయాల ద్వారా ప్ర జల సంక్షేమానికి ఉపయోగపడే నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.



# జగన్‌కు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్న వైసీపీ

వైసీపీ అధినేత కాన్వాయ్‌కు సంబంధించినదంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ ప్రమాద వీడియోపై ఆ పార్టీ తీవ్రస్థాయిలో స్పందించింది. ఈ వీడియోను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాజకీయ కుట్రకు పాల్పడుతోందని ఎక్స్ వేదికగా ఆరోపించింది. రాష్ట్రంలో పాలన, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని వైసీపీ సోషల్ మీడియా విభాగం విమర్శించింది.జగన్ జిల్లాల పర్యటనలకు వెళ్లినప్పుడు వస్తున్న భారీ ప్రజా స్పందనను కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోందని వైసీపీ ఆరోపించింది. అందుకే, వైసీపీ నాయకులను వేధించడం, తప్పుడు కేసులు నమోదు చేయడంతో పాటు ప్రమాదాలను కూడా రాజకీయం చేస్తోందని మండిపడింది. జగన్ ఇటీవల పల్నాడు పర్యటన సందర్భంగా సింగయ్య అనే వ్యక్తి మరణించడం దురదృష్టకరమని, ఈ ఘటనపై మానవత్వంతో వ్యవహరించాల్సింది పోయి, అత్యంత బాధాకరమైన రీతిలో తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారని వైసీపీ పేర్కొంది. ఈ విషయం తెలిసిన మరుసటి రోజే మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యక్తిగతంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 లక్షల ఆర్థిక సహాయం చెక్కును కూడా అందజేశారని వైసీపీ సోషల్ మీడియాలో వెల్లడించింది.అయితే, ప్రమాదానికి కారణమైన వాహనం జగన్ కాన్వాయ్‌లోనిది కాదని, అది ఓ ప్రైవేటు వాహనమని పల్నాడు జిల్లా ఎస్పీ ఇప్పటికే స్పష్టంగా తెలిపారని వైసీపీ గుర్తుచేసింది. సంబంధిత వాహన డ్రైవర్, యజమానిని గుర్తించి విచారించగా, ఈ ప్రమాదానికి కాన్వాయ్‌తో ఎలాంటి సంబంధం లేదని నిర్ధారించారని కూడా తెలిపింది. ఇన్ని వాస్తవాలు ఉన్నప్పటికీ, ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత, జగన్‌దే తప్పు అన్నట్లుగా కూటమి సర్కార్ ఓ వీడియోను విడుదల చేసిందని వైసీపీ సోషల్ మీడియా ఇంఛార్జ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.వీడియోలో కాన్వాయ్ చుట్టూ పెద్ద సంఖ్యలో జనం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని, ఆ ప్రమాదం జరిగిందన్న విషయం జగన్‌కు తెలియదని వైసీపీ తెలిపింది. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న జగన్‌కు కనీసం రోప్ పార్టీ, రోడ్ క్లియరెన్స్ బృందాన్ని కేటాయించాల్సి ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం తగిన భద్రత కల్పించడంలో విఫలమైందని, ఫలితంగా పదేపదే లోపాలు తలెత్తుతున్నాయని ఆరోపించింది. కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆయన భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. నీతి, నిజాయతీ, బాధ్యతాయుతమైన రాజకీయాలకు తమ పార్టీ కట్టుబడి ఉందని తెలిపింది.



11 ఏండ్లలో 29 వేల మందిని బలి తీసుకున్న

# ముంబై లోకల్ రైళ్లు

దేశ ఆర్థిక రాజధాని ముంబై ప్రజా రవాణా వ్యవస్థలో సబర్బన్ రైల్వే వ్యవస్థ అత్యంత ప్రధానమైనవి. ఉరుకులుపరుగుల జీవనం గడిపే కోట్లాది మంది రవాణా కష్టాలను లోకల్ రైళ్లు తీరుస్తాయి. నిత్యం రద్దీగా ఉంటే ఈ రైళ్లు.. ఉదయం, సాయంత్రం వేళల్లో జనంతో కిక్కిరిసిపోతాయి. కనిసం నిలబడటానికి కూడా జాగా లేక ప్రజలు వేలాడబుతూ ప్రయాణాలు చేయడం సర్వసాదారణం. అయితే ముంబై ప్రజల జీవనంలో భాగమైన లోకల్ రైళ్లు.. వారి ప్రాణాలను కూడా బలితీసుకుంటున్నాయి. మహానగరంలో ప్రతిరోజూ ఏదో ఒక మూల రైలు ప్రమాదాల్లో ప్రజలు చనిపోతూనే ఉన్నారు. ఇలా గత పదకొండేండ్ల కాలంలో ఏకంగా 29 వేల మందికిపైగా రైలు ప్రమాదాల్లో మరణించారు. వారిలో 8,416 మంది బాధితులను ఇప్పటికీ గుర్తించకపోవడం గమనార్హం. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.



# దూసుకుపోతున్న కుబేర

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న లేటెస్ట్ యునినామస్ బ్లాక్ బస్టర్ శేఖర్ కమ్ముల 'కుబేర'. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌విసిఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్‌తో నిర్మించారు. కుబేర తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై యునానిమస్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకొని హౌస్‌ఫుల్ బుకింగ్స్‌తో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ బ్లాక్‌బస్టర్ కుబేర సక్సెస్ మీట్ నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. బ్లాక్‌బస్టర్ కుబేర సక్సెస్ మీట్‌లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. 'ఈ సినిమాలో ఓ మంచి క్యారెక్టర్ శేఖర్ రాయడం, అది నాగార్జున ఒప్పుకొని చేయడం ఇదే ఫస్ట్ సక్సెస్‌గా భావిస్తున్నాను. దేవ క్యారెక్టర్ లో ధనుస్‌ని తప్ప ఇంకెవరిని ఊహించుకోలేం. ఆ క్యారెక్టర్ చూసిన తర్వాత అలా అనిపించింది.

# బాలికను నగ్నంగా వీడియో కాల్ చేయాలని బెదిరించి... స్నేహితులకు వీడియో షేర్ చేసిన బాలుడు

బాలికతో స్నేహంగా ఉండి ఆమెను బెదిరించి ఓ బాలుడు నగ్న వీడియోలు తీశాడు. నగ్న వీడియోలను తన స్నేహితులకు షేర్ చేశాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఇద్దరు బాలుర్లతో ఆరుగురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఓ గ్రామంలో బాలికలో ఓ బాలురు స్నేహంగా ఉండేవాడు. ఆమెతో రోజు వాట్సప్‌లో బాలుడు చాటింగ్ చేసేవాడు. నగ్నంగా వీడియో కాల్ చేయాలని లేకపోతే చాటింగ్‌ను తల్లిదండ్రులకు చూపిస్తానని బాలికను బాలుడు బెదిరించాడు. బాలిక భయంతో నగ్నంగా వీడియో కాల్ చేసింది. దీంతో వీడియో కాల్‌ను రికార్డు చేసి తన ఏడుగురు స్నేహితులకు షేర్ చేశాడు. దీంతో బాలికను లైంగికంగా, శారీరకంగా వేధించడంతో గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌లో తన తల్లిదండ్రులతో కలిసి ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి ఇద్దరు బాలుర్లను జువైనల్ హోమ్‌కు తరలించారు. మిగిలిన యువకుడు కారడ సుధీర్(28), వరుణ్(18), వంశీకృష్ణ(20), బాలవంత్ సింగ్(18), విఠల్(23), తరుణ్(18)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



# శ్రద్ధా హాట్ స్టిల్స్

హీరోలు, హీరోయిన్స్ లగ్జరీ లైఫ్ ను లీడ్ చేస్తుంటారు. వేసుకునే బట్టలు , వాడే కార్లు, ఉండే బంగ్లాలు అన్ని చాల కాస్ట్లీ గా ఉంటాయి. సెలబ్రెటీలు వాడే ఒక్క వాచ్ ధరతో ఓ సామాన్యుడు రిచ్ గా బ్రతికేయొచ్చు. అయితే కొంతమంది మాత్రం రిచ్ లైఫ్ ను ఎంజాయ్ చేస్తూనే అప్పుడప్పుడు సింప్లీసిటీతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకుంటుం టటారు. ఎన్ని కోట్ల ఆస్తులున్నా కూడా కొంత మంది సింపుల్ గా జీవిస్తూ ఉంటారు. మొన్నామధ్య కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ చిన్న కారును వాడుతున్నారని వార్తలు వచ్చాయి. వెయ్యి కోట్లు కలెక్ట్ చేసిన సినిమా దర్శకుడు అయ్యుండి కూడా చిన్న కారులో తిరుగుతుండటం వైరల్ అయ్యింది. తాజాగా ఓ హీరోయిన్ కూడా కోట్లు ఉన్న కూడా ఎంతో సింపుల్ గా చిన్న కారులో తిరుగుతూ.. అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. 15 ఏళ్ల సినిమా కెరీర్లో ఆషిఖీ-2, బాఘీ, హాఫ్ గర్ల్‌ఫ్రెండ్, స్త్రీ తదితర సినిమాల్లో నటించిన శ్రద్ధా.. సాహో సినిమాలో ప్రభాస్ సరసన మెరిసింది. కాగా శ్రద్ధా కపూర్‌కు మారుతి సుజికీ స్విఫ్ట్ కారును వాడుతుందని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే నిజంగా శ్రద్ధా కపూర్‌కు మారుతి సుజికీ స్విఫ్ట్ కారును వాడుతోందా.? అని నెట్టింట చర్చ జరుగుతుంది. నెటిజన్స్ ఈ విషయం పై గూగుల్ లో గాలిస్తున్నారు. అలాగే ఆమె దగ్గర ఎన్ని కార్లు ఉన్నాయన్నది కూడా ఆరా తీస్తున్నారు. కాగా శ్రద్ధా కపూర్‌కు మారుతి సుజికీ స్విఫ్ట్ కారుతోపాటు లాంబోర్గినితోపాటు రేంజ్‌రోవర్, మెర్సిడెస్ బెంజ్‌కు చెందిన మూడు మోడళ్లు, ఆడి క్యూ7, టయోటా ఫార్చ్యునర్ కార్లు ఉన్నాయని గూగుల్ తెలుపుతుంది.

# కాజల్ ఫ్యామిలీ వెకేషన్

కలువ కళ్ల సుందరి కాజల్ అగర్వాల్ పెళ్లైన తర్వాత సినిమాలు తగ్గించింది. పూర్తిగా తన సమయాన్ని ఫ్యామిలీకి కేటాయిస్తుంది. ఏదో అడపాదడపా మాత్రమే సినిమాలు చేస్తుంది. టాలీవుడ్‌తో పాటు అన్ని భాషల ఇండస్ట్రీలోనూ మంచి గుర్తింపు, గౌరవం దక్కించుకుంది కాజల్. పెళ్లి తర్వాత సినిమాల ఎంపిక మొదలుకుని అన్ని విధాలుగా హుందాగా వ్యవహరించడం, ఒక వివాహితగా బాధ్యతాయుతంగా ఉండడం చూడముచ్చటగా అనిపిస్తుంది. తల్లి అయినప్పటి నుండి అయితే కొడుకు ఆలనాపాలనా చూసుకుంటూ సరదాగా గడుపుతుంది. ఎక్కడికి వెళ్లిన కొడుకుని తీసుకొనే వెళుతుంది.మొత్తానికి కాజల్ అగర్వాల్ తన మదర్ డ్యూటీని నిర్వర్తిస్తూనే ఎప్పటికప్పుడు కొడుకుతో ఉన్న ఫోటోలు, వీడియోలను షేర్ చేయడం ద్వారా మరింత గా ఫాలోవర్స్‌ను పెంచుకునే ప్రయత్నం చేస్తుంది. కాజల్ నటించిన కన్నప్ప సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఆ సినిమాలో గెస్ట్ పాత్రలో మాత్రమే కనిపిస్తుంది. ముందు ముందు సెకండ్ ఇన్నింగ్స్‌లో అక్కగా, అమ్మగా కాజల్ నటిస్తే కచ్చితంగా మరిన్ని ఆఫర్లు వచ్చే అవకాశం ఉంది. మరి కాజల్ అలా నటించేందుకు సిద్దమేనా , లేకుంటే హీరోయిన్‌గానే మరికొన్నాళ్లు కొనసాగిస్తుందా చూడాలి. 2020లో పెళ్లి చేసుకున్న కాజల్ 2022 ఏప్రిల్ 19న కుమారుడు నీల్ కిచ్లూకి జన్మనిచ్చింది. ఇక అప్పటి నుండి కాజల్ అగర్వాల్ సినిమాలకి కాస్త దూరంగానే ఉంటుంది.